మూడు రోడ్లకు రూ.30 కోట్లు మంజూరు

మంత్రి గుమ్మిడి సంధ్యారాణి

విశాలాంధ్ర - సాలూరు: గిరిజన గ్రామాలన్నింటికీ రోడ్డు సౌకర్యం కల్పిస్తామని స్త్రీ శిశు సంక్షేమ, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి అన్నారు. సోమవారం సాలూరు మండలం తోణం పంచాయతీ సిమిడివలస నుంచి కొత్తూరు వరకు వేసిన రోడ్డును సంధ్యారాణి ప్రారంభించారు. రూ.1.25 కోట్లతో రోడ్డు వేశారు. ఈ సందర్భంగా ఆమె ప్రసంగిస్తూ తన హయాంలో రహదారి సౌకర్యం లేని అన్ని గ్రామాలకు రోడ్లు వేస్తామని తెలిపారు. సాలూరు మండలంలో మూడు రోడ్లకు మరో రూ.30 కోట్లు మంజూరయ్యాయని ఆమె తెలిపారు. ఈ నిధులతో కురుకుట్టి నుంచి సంపంగిపాడు వరకు రూ.17.20 కోట్లతో 14 కిలోమీటర్ల రోడ్డు, కొదమ నుంచి చింతమల వరకు రూ.7.90 కోట్లతో ఆరు కిలోమీటర్ల రోడ్డు, మరో రహదారిని ఏర్పాటు చేస్తున్నారు. డోలి సమస్యలు తలెత్తకుండా గిరిజన గ్రామాలన్నింటికీ రహదారులు ఏర్పాటు చేసేందుకు ముఖ్యమంత్రి అంగీకరించారని ఆమె తెలిపారు. సిమిడివలస ప్రజలు పాఠశాల, అంగన్వాడీ కేంద్రాలు కావాలని కోరగా ఆమె స్పందిస్తూ.. విద్యార్థుల సంఖ్య, నిబంధనలు అనుకూలిస్తే గ్రామంలో పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రం ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామన్నారు.

పిల్లల్లో నైతికత పెంపొందించండి

పిల్లల్లో ముఖ్యంగా మగపిల్లల్లో కనీస నైతికత పెంపొందించాలని మంత్రి ప్రజలకు విజ్ఞప్తి చేశారు. రోజు రోజుకు ఆడపిల్లలు, మహిళలపై అనేక సంఘటనలు జరుగుతున్నాయని, అందుకు సమాజమే కారణమని ఆమె వాపోయారు. కుటుంబంలోనే నీతి బోధించాలని ఆమె అన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు ఆముదాల పరమేష్, సీనియర్ నాయకులు కరిబుగత భాస్కరరావు, ఆముజూరి శ్రీను, మత్స శ్యాం, దొర లక్ష్మణ, ఎంపీడీఓ గొల్లపల్లి పార్వతి, ఐటీడీఏ ఈఈ మణిరాజ్, డీఈఈ బలివాడ సంతోష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రంజాన్ శుభాకాంక్షలు తెలిపిన కేంద్ర మాజీ మంత్రి కిషోర్ దేవ్

విశాలాంధ్ర - కురుపాం: పవిత్ర రంజాన్ ఉపవాస దీక్షలు పూర్తి చేసుకుని రంజాన్ పవిత్ర పండుగ జరుపుకుంటున్న కురుపాం ముస్లింలకు కేంద్ర మాజీ

మంత్రి వైరిచర్ల కిషోర్ దేవ్ సోమవారం ఉదయం శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మతసామరస్యతకు ప్రతీకగా నిలిచిన పవిత్ర రంజాన్ పండుగ ఆనందంగా జరుపుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ముస్లిం మతపెద్దలు, యువత, యస్ స్వచ్ఛంద సంస్థ కార్యదర్శి షేక్ గౌస్ తదితరులు పాల్గొన్నారు.

ఫ్యాప్టో నిరసన విజయవంతం చేయండి

విశాలాంధ్ర - బెలగాం: ఫ్యాప్టో రాష్ట్ర సంఘం పిలుపు మేరకు పిఆర్సీ, ఐఆర్, బకాయిల విడుదల తదితర సమస్యల సాధనకై ఏప్రిల్ 2వ తేదీ బుధవారం సాయంత్రం 3 గంటలకు పార్వతీపురం, కలక్టరేట్ వద్ద జరుగుతున్న నిరసన కార్యక్రమంలో ఉపాధ్యాయులు, ఫ్యాప్టో కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఫ్యాప్టో పార్వతీపురం మన్యం జిల్లా ఛైర్మన్ పి. కూర్మినాయుడు, జనరల్ సెక్రటరీ టి.అనిల్ కుమార్ ఒక ప్రకటనలో కోరారు.

గుమ్మడివరం రైల్వేగేటు వద్ద వ్యక్తి మృతి

విశాలాంధ్ర - సీతానగరం: సీతానగరం నుండి బొబ్బిలి రైల్వే స్టేషన్ల మధ్య గుమ్మడివరం రైల్వేగేటుదరి గంజాం జిల్లాకు చెందిన అరుణ్ బెహరా(40) అనే వ్యక్తి రైలు ఢీకొని మృతి చెందాడు. కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు జి ఆర్ పి హెడ్ కానిస్టేబుల్ బి.ఈశ్వరరావు తెలిపారు. పోస్ట్‌మార్టం నిమిత్తం అతని మృతదేహాన్ని విజయనగరం ఆసుపత్రిలో ఉంచినట్లు తెలిపారు. ఇతని వివరాలు తెలిస్తే కానిస్టేబుల్ సెల్ నంబర్ 8309901038, 9491813163లకు తెలపాలని కోరారు.

న్యాయవాదుల సంఘ ఉపాధ్యక్షునిగా కృష్ణ

విశాలాంధ్ర - బెలగాం : ఇటీవల జరిగిన పార్వతీపురం న్యాయవాదుల సంఘ ఎన్నికలలో ఉపాధ్యక్షునిగా పి.కృష్ణ ఎన్నికయ్యారు. ఈసందర్భంగా క్రష్ణను ఆల్ ఇండియా ఎస్సీ, ఎస్టీ రైల్వే ఎంప్లాయిస్ (భువనేశ్వర్ జోన్) అసోసియేషన్ ఈస్ట్ కోస్ట్ రైల్వే ఉపాధ్యక్షులు గంధారపు శ్రీనివాసరావు అభినందించారు. అలాగే మిగతా కార్యవర్గానికి అభినందనలు తెలిపారు.

నేడు చండీ హోమం

విశాలాంధ్ర - మక్కువ: మన్యం జిల్లా మక్కువ మండలంలో సంబర గ్రామంలో వేంచేసి ఉన్న ప్రముఖ ఇలవేల్పు ఉత్తరాంధ్ర గిరిజన ఆరాధ్య దేవత శ్రీ శంబర పోలమాంబ అమ్మవారి జాతర మహోత్సవములలో భాగంగా 10వ మంగళవారం భక్తులు అధిక సంఖ్యలో పాల్గొంటారని ఆలయ కార్యనిర్వహణాధికారి వివి సూర్యనారాయణ తెలిపారు. 10వ మంగళవారం సందర్భంగా ఉదయం తొమ్మిది గంటలకు చండీ హోమం జరుగుతుందని, మధ్యాహ్నం 12.00 గంటల నుండి మహా అన్నదానం కూడా జరుగుతుందన్నారు. కావున వచ్చే భక్తులకు ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఆలయ సిబ్బంది ఏర్పాట్లు అన్ని పూర్తి చేశామని తెలిపారు.

జిల్లా అభివృద్ధిలో భాగస్వాములు కావాలి

కలెక్టర్ శ్యాం ప్రసాద్

విశాలాంధ్ర - పార్వతీపురం టోన్: జిల్లా అభివృద్ధిలో అందరూ భాగస్వాములు కావాలని కలెక్టర్ శ్యాం ప్రసాద్ అన్నారు. ఉగాది వేడుకల్లో ఆయన పాల్గొని మాట్లాడుతూ విశ్వావసు నామ సంవత్సరంలో జిల్లా సుభిక్షంగా ఉండాలని ఆకాక్షించారు. జిల్లా అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని అన్నారు. ప్రతి కుటుంబం ఆరోగ్యం, ఆర్థికాభివృద్ధితో తులతూగాలని పేర్కొన్నారు. ప్రజా శ్రేయస్సు, సంక్షేమం, అభివృద్ధిలో జిల్లాను ప్రగతి పథంలో నడిపించుట ధ్యేయంగా పని చేస్తున్నామని ఆయన చెప్పారు. పి 4 కార్యక్రమాన్ని ప్రభుత్వం ఉగాది సందర్భంగా విడుదల చేసిందని తద్వారా ఒకరి సహకారంతో ఒకరి అభివృద్ధి అనే నినాదంతో ముందుకు వెళ్ళడం జరుగుతుందని అన్నారు. జిల్లాలో 214 గ్రామాలకు రహదారి సౌకర్యం అవసరం ఉందని అందులో ఇప్పటికే వంద గ్రామాలకు రహదారులు వేయడం జరుగుతుందని ఆయన చెప్పారు. పోలీస్ సూపరింటెండెంట్ ఎస్‌వి మాధవ రెడ్డి మాట్లాడుతూ ఉగాది వేడుకలు తెలుగు సంస్కృతికి సంప్రదాయాలకు నిలువుటద్దం అన్నారు. ఉగాది తెలుగు ప్రజల కొత్త సంవత్సరం అని, కొత్త పనులు ప్రారంభం చేయుటకు గొప్ప రోజుగా భావిస్తున్నానన్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎస్-ఎస్ శోభిక, ఏఎస్పీ అంకిత సురానా, జిల్లా రెవిన్యూ అధికారి కె.హేమలత, డిప్యూటీ కలెక్టర్ డా పి ధర్మచంద్రా రెడ్డి, జిల్లా అధికారులు ఎన్‌టి నాయుడు, తమర్భ కొండలరావు, కె.చలపతిరావు, ఏ.మురళీధర్, టి.దుర్గా ప్రసాద్ రెడ్డి, ఓ.ప్రభాకరరావు, జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి ఆర్.కృష్ణవేణి, లయన్స్ క్లబ్ అధ్యక్షులు బిఎన్‌బి రావు, రెడ్ క్రాస్ చైర్మన్ డా.మంచిపల్లి శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

టిడ్కో గృహాలను లబ్ధిదారులకు అందించాలి: సీపీఐ

విశాలాంధ్ర - పార్వతీపురం టౌన్: టిడ్కో లబ్ధిదారులకు గృహాలు వెంటనే అందజేయాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి తోట జీవన్న, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బుడితి అప్పల నాయుడు, గరుగుబిల్లి సూరయ్యలు డిమాండ్ చేశారు. సోమవారం అడ్డాపు శీల గ్రామ పరిధిలో ఉన్న టిడ్కో గృహాలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2015లో అడ్డాపు శీల గ్రామ పరిధిలో 16 అపార్ట్మెంట్లో 768 గృహాలు నిర్మించి లబ్ధిదారులకు పంచడానికి సిద్ధంగా ఉన్నప్పటికీ లబ్ధిదారులకు గృహాలను అప్పజెప్పకుండా మారుతున్న ప్రభుత్వాలు టిట్కో లబ్ధిదారులను ప్రతి ఏటా ఏప్రిల్ ఫూల్ చేస్తున్నారని ఆరోపించారు. నేటికీ 10 సంవత్సరాలు అవుతున్నప్పటికీ గృహాలను లబ్ధిదారులుకు అందజేయకుండా తాత్సారం చేయడం పట్ల సీపీఐ అభ్యంతరం వ్యక్తం చేస్తుందన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత మరలా ఇప్పుడు టిడ్కో లబ్ధిదారుల లిస్టు మార్చడానికి తీవ్ర ప్రయత్నం జరుగుతుందని అన్నారు. ఏ ప్రభుత్వం ఉంటే ఆ ప్రభుత్వ మద్దతుదారులను చేర్చడం పరిపాటిగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. లబ్ధిదార్లను మార్చడానికి పూనుకుంటే అసలైన టిడ్కో లబ్ధిదారులకు ఎప్పుడు గృహాలు అందిస్తారని ప్రశ్నించారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం స్పందించి టిడ్కో అసలు లబ్ధిదారులను గుర్తించి గృహాలు వెంటనే స్వాధీనపరచాలని లేనిపక్షంలో రాష్ట్ర నాయకత్వాన్ని దించి టిడ్కో లబ్ధిదారులందరినీ సమీకరించి పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు బొత్స మోహన్‌రావు పాల్గొన్నారు.

మా గ్రామాల మధ్య బిటి రోడ్డు వెయ్యరూ....!

విశాలాంధ్ర - జియ్యమ్మవలస: మండలంలోని పెదబుడ్డిడి ప్రక్కనే ఉన్న వీరఘట్టం మండలంలోని దశు మంతపురం గ్రామాల మధ్య కేవలం రెండు కిలో మీటర్ల రోడ్డు వేయండని ఎన్నిసార్లు మొర పెట్టుకున్నా ఫలితం శూన్యమని ఇరు గ్రామాల ప్రజలు వాపో తున్నారు. ప్రభుత్వాలు మారుతున్నాయి కానీ రోడ్డు నిర్మాణం కోసం దృష్టి పెట్టే నాయకులే కరువయ్యారని ఇరు గ్రామాల ప్రజలతో పాటు ఇతర మండలాల నుండి వస్తున్న వాహన చోదకులు మండి పడుతున్నారు. వీరి ఆవేదనకు ప్రధాన కారణం చినుకు పడిందంటే వాహన చోదకులు ఎలాగూ వెళ్ళలేరు కనీసం పాదచారులు వెళ్తే ఏ గుంతలో ఏ పొలంలో జారి పడిపోతామేమోనని భయంతో వెళ్లాల్సిన దుస్థితి. ముఖ్యంగా ఈ రోడ్డును వేసినట్లయితే అటు గుమ్మలక్ష్మీపురం, కురుపాం, జియ్యమ్మ వలస మండలాల ప్రజలు అటు వీరఘట్టం, పాలకొండ, శ్రీకాకుళం వెళ్లేందుకు ప్రయాణభారంతో పాటూ సమయభావం ఆర్థిక భారం కూడా తగ్గుతోందని ప్రజలు కోరుతున్నారు. గతంలో జిల్లాలు వేరని కుంటి సాకులతో తాత్సారం చేశారని ఇప్పుడు ఒకటే జిల్లా కావున ప్రభుత్వ పెద్దలు అధికారులూ స్పందించి వస్తున్న కొత్తబడ్జెట్ లోనైనా ఈ రహదారికి బిటి రోడ్డు వేయించి మోక్షం కలిగించి ఈ నరక (నడక) యాతన నుండి విముక్తి కలిగించాలని, దీనిపై జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.

మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో మినుములు కొనుగోలు

విశాలాంధ్ర - పార్వతీపురం: నాఫెడ్, మార్క్ ఫెడ్ ఆధ్వర్యంలో మినుములు కొనుగోలు చేయడం జరుగుతుందని జాయింట్ కలెక్టర్ ఎస్.ఎస్ శోభిక తెలిపారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లా వ్యాప్తంగా రబీసీజన్ లో సాగు చేసిన అపరాల కొనుగోలుకు సంబంధించి పేరు నమోదు ప్రక్రియ ప్రారంభించామని ఆమె తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు నాఫెడ్, మార్క్ ఫెడ్ ఆధ్వర్యంలో మినుములు కొనుగోలు చేస్తామని ఆమె చెప్పారు. క్వింటా మినుములకు రూ.7,400 మద్దతు ధర నిర్ణయించడం జరిగిందని ఆమె పేర్కొన్నారు. ఈ-క్రాప్, ఈ-కెవైసీ చేయించుకున్న రైతులు తమ పరిధిలోని రైతు సేవా కేంద్రాలలో సియం యాప్ (సిఎంఎపిపి) లో పేర్లను నమోదు చేయించుకోవాలని ఆమె కోరారు. నిర్దేశిత ప్రమాణాలకు అనుగుణంగా పంటను విక్రయించాలని జెసి శోభిక సూచించారు.

కానరాని బ్రిడ్జి నిర్మాణం

ఎ.దారకొండ పంచాయతీ గ్రామాల ప్రజలు ఇక్కట్లు
- పట్టించుకోని అధికారులు
- సర్పంచ్ ముర్ల సత్యవతి ఆవేదన

విశాలాంధ్ర - జీకే వీధి: మండలంలోని ఏ.దారకొండ పంచాయతీకి చెందిన గొల్లపల్లి, నడుం వీధి మార్గమధ్యలో పెద్ద కాలువ ఉండడంతో వర్షాకాలం నీటి ప్రవాహం ఎక్కువ ఉండటం వల్ల గ్రామస్తులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీంతో అనేక గ్రామాలలో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతుంది. ఈ మార్గంలో కాలువ దగ్గర బ్రిడ్జి నిర్మాణం చేపట్టాల్సి ఉంది. నడిం వీది, గొల్లపల్లి మధ్యలో కాలువలో బ్రిడ్జి నిర్మాణం కొరకు పలుమార్లు అధికారులకు విన్నవించినా కనీస చలనం లేదని, రాబోవు కాలంలో భారీ వర్షాలు కురుస్తాయని, దీనివల్ల ఎన్నో ఇక్కట్లు పడతామని సర్పంచ్ ముర్ల సత్యవతి తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు.

అధికారులు బ్రిడ్జి నిర్మాణం కొరకు ఊసే ఎత్తడం లేదని పంచాయతీలో సుమారు చాలా గ్రామాలు బ్రిడ్జి మీదే ఆధారపడి ఉన్నాయని ఆమె అన్నారు. బ్రిడ్జి మంజూరు చేసి నిర్మాణం చేయడం వల్ల వైద్య సదుపాయాలు, నిత్యావసర రేషన్ సరుకులు సమస్య తీరుతుందని అనేక గ్రామాల అభివృద్ధికి ఈ బ్రిడ్జి నిర్మాణంతోనే ముడిపడి ఉందని కనుక అధికారులు స్పందించి తక్షణమే కాలువలో బ్రిడ్జి మంజూరు చేసి చర్యలు తీసుకోవాలని ఆమె అధికారులకు కోరారు.

ఘనంగా ఉగాది పర్వదిన వేడుకలు

విశాలాంధ్ర - కొయ్యూరు: ఉగాది పర్వదినాన్ని మండల వ్యాప్తంగా ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. విశ్వావసు నామ సంవత్సర ఉగాది పండగను పురస్కరించుకొని భక్తులు ఆలయాలకు వెళ్లి ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. ఉగాది సంబరాల్లో భాగంగా తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో మండలంలోని చింతలపూడి పంచాయతీ సింగరాలపాడు గ్రామ రామాలయంలో టీటీడీ ధర్మ ప్రచారక్ పద్మరాజు ఆధ్వర్యంలో పురోహితులు డి.శ్రీరామచంద్రమూర్తి శర్మ పంచాంగ శ్రవణ కార్యక్రమాలు నిర్వహించారు. ద్వాదశ రాశుల ఫలితాలు, విశ్వా వాసు నామ సంవత్సర విశేషాలను వివరించారు. భక్తులకు ఉగాది పచ్చడిని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాల్లో ఆయా గ్రామ పెద్దలు ఉల్లి సూరిబాబు కనకరాజు, వివిధ ధార్మిక సంస్థల ప్రతినిధులు మల్లిబాబు, సన్యాసిరావు, వీర్రాజు, డివిడి ప్రసాద్, శివయ్య పాల్గొన్నారు.

ఘనంగా ఈద్ ఉల్ ఫితర్ "రంజాన్"

విశాలాంధ్ర - చింతపల్లి: ముస్లింలు పవిత్ర పర్వదినంగా భావించే ఈద్ ఉల్ ఫితర్ గా పిలుచుకునే "రంజాన్" పర్వదిన వేడుకలు చింతపల్లిలో సోమవారం ఘనంగా జరిగాయి. మండల కేంద్రమైన చింతపల్లి లోని మజీద్ ఏ క్యూబాలో ఈద్-ఉల్-ఫితర్ రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకుని ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా ముస్లింలు ఒకరి కొకరు ఆలింగనం చేసుకొని, రంజాన్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. మండలంలోని ఇతర ప్రాంతాల నుంచి ముస్లిములు ఉదయాన్నే మజీద్ ఏ క్యూబా వద్దకు చేరుకొని పండగ ప్రత్యేక నమాజ్ (ప్రార్థనలు)ను ఆచరించారు. ఇస్లామియా క్యాలెండర్ ప్రకారం ప్రతి ఏటా 9వ నెలలో వచ్చే రంజాన్ మాసాన్ని నెలవంక రాకతో నెలరోజులపాటు కఠోర ఉపవాస దీక్షలు, ప్రత్యేక నమాజులు ఆచరించి, మరలా నెలవంక చూసి జరుపుకునే అతి పవిత్రమైన పర్వదినంగా భావించి "రంజాన్". పర్వదినాన్ని ముస్లింలు ప్రతీ ఏటా ఘనంగా జరుపుకుంటున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగా ముస్లింలు అత్యంత పవిత్రంగా భావించే రంజాన్ పర్వదినాన్ని చిన్న, పెద్ద తారతమ్య బేధాలు లేకుండా ప్రతీ ఒక్కరూ భక్తి శ్రద్ధలతో నమాజ్ చేసి పవిత్రం గా పండుగను జరుపుకున్నారు. ఈ సందర్భంగా మత గురువు మహమ్మద్ సాహిద్ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించడంతోపాటు క్రమశిక్షణ, దాతృత్వం, ధార్మిక, చింతనల యొక్క కలయికే ఈ రంజాన్ మాసపు సారాంశమని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో మజీద్ కమిటీ అధ్యకులు షేక్ మీరా సాహెబ్, మండల కో ఆప్షన్ సభ్యుడు నాజర్ వల్లి, సభ్యులు షేక్ ఖాసింవలీ, నూర్ సాహెబ్, షేక్ సత్తార్, వల్లి, రసూల్ ముస్లింలు పాల్గొన్నారు.

రెబల్ అభ్యర్థి అబ్రహం గో బ్యాక్

విశాలాంధ్ర - అనంతగిరి: అధిష్టానం ఆదేశాలను బేఖాతర్ చేసి అసెంబ్లీ ఎన్నికల్లో టీడీపీ పార్టీకి వ్యతిరేకంగా.. రెబల్ అభ్యర్థిగా పోటిచేసిన సివేరి అబ్రహం పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉండాలని టీడీపీ నాయకులు మండల కేంద్రంలోని సోమవారం భారీ ర్యాలీ చేపట్టారు.. టీడీపీ యువజన విభాగం నాయకులు పొంగి బాబీ, సుబ్బారావు ఆధ్వర్యంలోని నాయకులు, కార్యకర్తలు ఆందోళన కార్యక్రమంతో పాటుగా ర్యాలీ నిర్వహించారు. అబ్రహం గో బ్యాక్ అంటూ పెద్ద ఎత్తున నినదాలు చేశారు. సస్పెన్షన్‌కు గురైన వ్యక్తి ద్వారా పార్టీ ఆవిర్భావ దినోత్సవంలోని జెండాను ఎగరవేయించడంపై దుయ్యబట్టారు. అరకు ఇన్‌చార్జి సివేరి దొన్నుదొర ఆదేశాలు దిక్కరించి, మండల టీడీపీ నాయకులపై చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. పార్టీకి కష్టపడి పనిచేస్తున్న నాయకులు, కార్యకర్తలను గుర్తించి, న్యాయం చేయాలని, అధికారంలోకి వచ్చిన తరువాత వచ్చిన వారికి ప్రాధాన్యతనిస్తే.. తీవ్రంగా నష్టపోతామని తెలిపారు. ఈ కార్యక్రమంలోని యువజన విభాగం నాయకులు చిట్టిబాబు, మాజీ వైస్ ఎంపీపీ గుండన్న, ఈశ్వరరావు, శంకరరావు, భీమన్న తదితరులు పాల్గొన్నారు.

2న వారపు సంత వేలం

విశాలాంధ్ర - హుకుంపేట: మండలం కేంద్రం పరిధిలో గల హుకుంపేట గ్రామ పంచాయతీ కేంద్రంలో వారపు సంత వేలం పాట ఈనెల 2వ తేదీన జరుగుతుందని స్థానిక సర్పంచ్ సమీడ వెంకట పూర్ణిమ తెలిపారు. సోమవారం ఆమె స్థానిక విలేకరులతో మాట్లాడుతూ 2వ తేదీ బుధవారం ఉదయం 11:00 గంటలకు స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో వేలంపాట జరుగుతుందన్నారు. స్థానిక గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న ఆసక్తి గల యువత రెండు రోజులు ముందుగా రిజిస్ట్రేషన్ ఫీజు రూ.5 వేలు చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో సచివాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలపై శిక్షణ

విశాలాంధ్ర - హుకుంపేట: మండలంలోని సంతారి, రాప పంచాయతీలలో 81 మంది ఆదివాసీ యువతకు ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వ అమలు చేస్తున్న పథకాలపై ప్రత్యేక శిక్షణ కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ శిక్షణలో నేచర్ సంస్థ ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ పండోయ్ రవి కుమార్ పాల్గొని ప్రభుత్వ పథకాలు, హక్కులు, అర్హత ప్రమాణాలు, ప్రస్తుతం అమలులో ఉన్న పథకాల గురించి వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమైన పత్రాలు, ఉద్యోగ సూచనలు, మత్తు వ్యసనాల నివారణ, క్రీడలు, స్థానిక పాలన, వనరుల మ్యాపింగ్, గ్రామాభివృద్ధి, డిజిటల్ సౌకర్యాలపై యువతకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సృజన స్వచ్ఛంద సేవ సంస్థ సిబ్బంది మత్యరాజు, లక్ష్మన్, కొండబాబు, నూకరాజు, అర్జున్, రామారావు, రంగబాబు, బాబురావు, యువత తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రంజాన్ వేడుకలు

విశాలాంధ్ర - జి.మాడుగుల: మండల కేంద్రం మసీదులో సోమవారం రంజాన్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. మండలలోని వివిధ ప్రాంతాల నుంచి మసీదుకు చేరుకొని భక్తి శ్రద్ధలతో రంజాన్ వేడుకలను జరుపుకున్నారు. ఒకరికి ఒకరు ఆలింగనం చేసుకుని శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. ఈ ఏడాదంతా అల్లా దయతో మానవాళికి మంచి జరగాలని ప్రార్థించారు. అనంతరం వక్ఫ్ బోర్డుపై కేంద్ర ప్రభుత్వం తీసుకున్న విధానాన్ని వ్యతిరేకంగా నల్లబ్యాడ్జిలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మత పెద్దలు సుబేర్, ఎండీ. హాజ, మీర, ముత్తప్ప ఎస్‌కె. రేహ్మాన్, ఎస్‌కే.ఆమీర్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ముత్యాలమ్మ తల్లి జాతర

విశాలాంధ్ర - ఎటపాక: ఎటపాక మండలం శ్రీరామ నగర్ కాలనీలో ముత్యాలమ్మ తల్లి జాతర పంతాడి అంజి ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. ఆదివారం ఆఖరి రోజు భక్తులు అధికంగా పాల్గొని పూజలు నిర్వహించి, అమ్మవారిని దర్శించారు. అమ్మవారి, మైశాసుర వేషధారణలతో నృత్యాలు చేశారు. చుట్టు పక్కల గ్రామాల నుండి భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

క్రైస్తవ సముద్రంగా మారిన "చింతపల్లి"

ప్రవీణ్ మృతిపై విచారణ చేయాలి
క్రైస్తవుల శాంతి ర్యాలీ

విశాలాంధ్ర - చింతపల్లి: మతోన్మాదాన్ని విడనాడండి... శాంతిస్థాపనకై ప్రయత్నించే క్రైస్తవ సేవకుల పట్ల ప్రేమ పూర్వకంగా వ్యవహరించాలని పాస్టర్ ఫెలోషిప్ అధ్యక్షులు పాస్టర్ డేవిడ్ రాజ్ అన్నారు. దైవజనులు వగడాల ప్రవీణ్ మరణం క్రైస్తవ సమాజానికి తీరనిలోటని క్రైస్తవ మత పెద్దలు శాంతి ర్యాలీ కోసం ఇచ్చిన పిలుపునకు స్పందించి పలు మండలాల నుంచి క్రైస్తవ మత పెద్దలు, అధిక సంఖ్యలో విశ్వాసులు సోమవారం చింతపల్లిలో శాంతి ర్యాలీ నిర్వహించారు. స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో కలసిన క్రైస్తవులందరూ సమిష్టిగా హనుమాన్ కూడలి నుంచి సంత మార్కెట్ వరకు శాంతియుతంగా భారీ ర్యాలీ నిర్వహించారు. భానుడు నిప్పులు చెరుగుతున్నప్పటికీ లెక్కచేయకుండా తమ మత పెద్ద దైవజనుడు ప్రవీణ్‌కు జరిగిన అన్యాయంపై గళం ఎత్తారు. దైవజనులపై దాడులను ఖండించాలని మరెవరికి ఇటువంటి అన్యాయం జరగకుండా ప్రభుత్వాలు చర్యలు చేపట్టాలని, వగదాల ప్రవీణ్ కు జరిగిన అన్యాయం పై పూర్తి విచారణ జరిపించాలని నినదిస్తూ శాంతి ర్యాలీ సాగింది. క్రైస్తవ మత ప్రచారకులకు, మందిరాలకు క్రైస్తవ విశ్వాసులకు ప్రభుత్వమే భద్రత కల్పించాలని, ప్రేమను పంచే క్రైస్తవుల పట్ల వివక్షతను విడనాడాలని క్రైస్తవ పెద్దలు కోరారు. క్రైస్తవమనేది మతం కాదని మంచికి మార్గమని గుర్తించాలన్నారు. క్రైస్తవ మతం తీసుకున్న ప్రతి ఒక్కరు ప్రేమను పంచే వారై ఉంటారని, ఎవరిని ద్వేషించే స్వభావం వారిలో ఉండదని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. చింతపల్లి, జికే వీధి, కొయ్యూరు, జి మాడుగుల, పాడేరు మండలాలకు చెందిన అధిక సంఖ్యలో తరలివచ్చిన క్రైస్తవ మత పెద్దలు, సేవకులు, అల్లూరి జిల్లాలోని 5 మండలాల పాస్టర్ ఫెలోషిప్ సభ్యులు పాస్టర్ కాలేబు, పాస్టర్ భూషణం, జోసఫ్, బాబురావు, డేవిడ్, తిమోతి, షారోన్ బృందం సభ్యుల ఆధ్వర్యంలో శాంతి ర్యాలీ విజయవంతంగా జరిగిందన్నారు. ఈ కార్యక్రమం విజయవంతానికి సహకరించిన పోలీసు శాఖ, పాత్రికేయులు, స్థానిక ప్రజలందరికీ ఈ సందర్భంగా క్రైస్తవ మత పెద్దలు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ దురియా పుష్పలత, షారోన్ బృందం సభ్యులు, హేమంత్ కుమార్, ఎస్ వనరాజు, రుత్తల సతీష్, ఆనంద రాజ్, క్రైస్తవులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర
పేజీ: 2
అల్లూరి సీతారామరాజు
పార్వతీపురం మన్యం
మంగళవారం 1, ఏప్రిల్ 2025

కొమిరికి ఉగాది పురస్కారం

విశాలాంధ్ర - బెలగాం: పార్వతీపురం లైన్స్ కళ్యాణమండపలో ఉగాది సందర్భంగా ఆదివారం పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ ఎ.శ్యాంప్రసాద్, జిల్లా పోలీసు సూపరెంటెండెంట్ ఎస్.వి మాధవ్ రెడ్డిల చేతుల మీదుగా పార్వతీపురం పట్టణ పోలీస్ స్టేషన్‌లో పనిచేస్తున్న హెడ్ కానిస్టేబుల్ (హెచ్సీ-1273) కొమిరి కృష్ణమూర్తి చేస్తున్న సేవలను గుర్తించి ఉగాది పురాష్కారంతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో పార్వతీపురం మన్యం జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.ఎస్ శోభిక, ఎఎస్పి అంకిత సురానతో పాటు ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

కవులకు, సేవకులకు పురస్కారాలు అందించిన కలెక్టర్

ఘనంగా విశ్వావసు ఉగాది వేడుకలు

విశాలాంధ్ర - పార్వతీపురం టౌన్: జిల్లాలో విశ్వావసు ఉగాది వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. రాష్ట్ర ప్రభుత్వ కార్యక్రమంగా లయన్స్ కళ్యాణ మండపంలో నిర్వహించిన వేడుకలకు జిల్లా కలెక్టర్ ఏ.శ్యామ్ ప్రసాద్ ముఖ్య అతిథిగా కుటుంబ సభ్యులతో సహా హాజరయ్యారు. కార్యక్రమాన్ని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. వేమకోటి నరహరి శాస్త్రి పంచాంగ శ్రవణంచేసి ఉగాది విశిష్టత, పంచాంగంలోని విశేషాలను, విశ్వావసు నామ సంవత్సరంలో భవిష్యత్తు వివరాలు తెలిపారు. మైలారపు సూర్య వెంకట రమణ వేద వచనం చేశారు. నారంశెట్టి ఉమామహేశ్వరరావు బెలగాం భీమేశ్వరరావు, గంటేడ గౌరు నాయుడు (సాహిత్యం), తాడ్డి సతీష్ కుమార్ (10టి.వి.యాంకర్), గడగమ్మ రామకృష్ణ (పత్రికారంగం), శీర జయరాం (అర్జున్ అవార్డు గ్రహీత, కురుపాం (క్రీడారంగం)), బెహరా ఉమామహేశ్వరరావు (సాహిత్యం), బుడితి బలరాం నాయుడు (శీరపాణి) (సాహిత్యం, పాలకొండ), డాక్టర్ వైవి పద్మజ (వైద్యం, వీణ), పెంటపాటి సూర్యారావు (వినియోగదారుల క్లబ్), బొండపల్లి వెంకట రమణ (ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ), సంకా గౌరీ శంకరరావు (సామాజిక సేవ), మాదా కృష్ణమూర్తి (సామాజిక సేవ), రామస్వామి (గీతా మందిరం) (అన్నదాన సేవ), శ్రీమతి సూర్ణ కాంతి గంటాయత్ (యోగ విద్య), కొమిరి కృష్ణమూర్తి హెడ్ కానిస్టేబుల్ (సేవా రంగం), జె.బి.తిరుమలాచార్యులు (వ్యాఖ్యానరంగం), కనకల పైడిరాజు (క్రీడారంగం పరుగు పందెం) డా. మంచిపల్లి శ్రీరాములు (ప్రకృతి వ్యవసాయం), గెంబలి గౌతమ్ (యువ శాస్త్రవేత్త, పార్వతీపురం), పల్లా పరిశినాయుడు (ప్రముఖ జాతీయ నఖచిత్ర కళాకారులు), వెనిగండ్ల పద్మజ (జట్టు ఆశ్రమం నిర్వాహకురాలు (సేవా విభాగం), ఏ. లక్ష్మణరావు (ఆశాజ్యోతి ఆశ్రమం), బ్రహ్మశ్రీ మురపాక కాళిదాసు శర్మ (ఆధ్యాత్మిక రంగం) తదితర29 మందికి పురస్కారాలు అందించారు. దేవదాయ శాఖకు చెందిన త్సదువుల వీర భద్రా స్వామి, (అర్చకులు, శ్రీ సోమేశ్వర స్వామి ఆలయం, దేమునిగుంపా, కొమరాడ మండలం)., బాలకృష్ణ పండా, (అర్చకులు, శ్రీ అభయ ఆంజనేయ స్వామి ఆలయం, నొంప్పకోన గ్రామం, గుమ్మలక్ష్మీపురం మండలం), సింహదాటి శంకర రావు, (అర్చకులు, శ్రీ కోదండరామాలయం, మరకొండ పుట్టి గ్రామం, మక్కువ మండలం)., ధమరసింగు కనక లింగేశ్వరరావు, (అర్చకులు, శ్రీ కాశీవిశ్వేశ్వర స్వామి ఆలయం, కాశీపట్నం, మక్కువ మండలం), మండల చంద్ర శేఖరరావు, (అర్చకులు, శ్రీ సీతారామ స్వామి ఆలయం, కుమ్మరిగుంట గ్రామం, వీరఘట్టం మండలం), పేరుమల్లా త్రినాదా చారి, (అర్చకులు, శ్రీ కోదండరామలయం, కోన గ్రామం, మక్కువ మండలం)., సిద్ధాంతం చిరంజీవులు, (అర్చకులు, శ్రీ అన్నపూర్ణ సమేత కాశీవిశ్వేశ్వర స్వామి ఆలయం, లక్ష్మీపురం, పార్వతీపురం)., శ్రీజ్యోష్యుల వీర భద్రా శర్మ, (అర్చకులు, శ్రీ వినాయక సమేత వీరంజనేయ స్వామి ఆలయం, బాసురు గ్రామం, పాలకొండ) 8 మంది అర్చక వేద పండితులను సత్కరించారు. కవి సమ్మేళనంలో పాల్గొన్న చావలి శేషాద్రి సోమయాజులు, చింతా అప్పల

నాయుడు, మీసాల వెంకట గౌరీ శంకరరావు, ఇల్లా ప్రసన్న లక్ష్మీ, మల్లిపూడి జగదీష్, గొట్టాపు శ్రీనివాసరావు, బౌరోతు శంకర్‌రావు, కిలపర్తి దాలినాయుడు, గుడ్ల అమ్మాజీ, జమ్మ బాబురావు, పళ్ళ రోహిణి కుమార్, పొందూరు సుధా కుమార్ తదితరులకు సత్కరించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎస్ఎస్ శోబిక, ఏఎస్పీ అంకిత సురానా, జిల్లా రెవిన్యూ అధికారి కె.హేమలత, డిప్యూటీ కలెక్టర్ డా పి.ధర్మచంద్రా రెడ్డి, జిల్లా అధికారులు ఎన్‌టి నాయుడు, తమర్భ కొండలరావు, కె.చలపతి రావు, ఏ.మురళీధర్, టి.దుర్గా ప్రసాద్ రెడ్డి, ఓ.ప్రభాకరరావు, జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి ఆర్.కృష్ణవేణి, లయన్స్ క్లబ్ అధ్యక్షులు బిఎన్‌బి రావు, రెడ్ క్రాస్ చైర్మన్ డా.మంచిపల్లి శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అంజనరావు వర్ధంతి

విశాలాంధ్ర - వి.ఆర్.పురం: అల్లూరి సీతారామరాజు జిల్లా మండల కేంద్రం విఆర్ పురం నందు మండల టీడీపీ నాయకుల ఆధ్వర్యంలో బొర్రా అంజనరావు 22వ వర్ధంతి సందర్భంగా ఆయన స్థూపం వద్ద చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ మండలంలో టీడీపీ బలోపేతానికి ఆయన ఎనలేని కృషి చేశారని ఆయన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ మండల అధ్యక్షుడు ఆచంట శ్రీనివాసరావు, జెడ్పీటీసీ వాళ్ళ రంగారెడ్డి, మాజీ జెడ్పీటీసీ ముత్యాల రామారావు, బొర్రా నరసింహారావు, పి.సుదర్శనరావు, బీరకాయ సూర్యప్రకాశరావు, ముత్యాల చంద్రశేఖర్, చెలికాని ఉమామహేశ్వరరావు, ఎం.వెంకన్న బాబు, ఎం.సాయి, బి.శంకర్రావు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పాస్టర్ ప్రవీణ్ మృతిపై సమగ్ర విచారణ జరిపించాలి

విశాలాంధ్ర- చింతూరు: పాస్టర్ ప్రవీణ్ మృతిపై రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర విచారణ చేపట్టాలని కోరుతూ చింతూరు మండలంలోని రత్నాపురం నుంచి చింతూరు వరకు ర్యాలీ మానవహారం చేశారు. ఈ సందర్భంగా డివిజన్లోని పలువులు పాస్టర్లు మాట్లాడుతూ ప్రవీణ్‌ది హత్య.. ప్రమాదమా నిర్ధారించాలని డిమాండ్ చేశారు. అంతేకాకుండా క్రైస్తవులపై దాడులను నిలువరింప చేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో చింతూరు వర రామచంద్రపురం, కూనవరం, ఎటపాక మండలాల పాస్టర్ల సంఘాలు పాల్గొన్నాయి.

రోడ్డు ప్రమాదాలపై అవగాహన అవసరం

విశాలాంధ్ర - ఎటపాక: వాహనదారులకు రోడ్డు ప్రమాదాలపై అవగాహన అవసరమని సీఐ కన్నప్పరాజు తెలిపారు. సోమవారం మండలంలోని సీతాపురం బస్ స్టాండ్ సమీపంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సిఐ మాట్లాడుతూ.. ఇటీవల కాలంలో రోడ్డు ప్రమాదాలు తరచుగా జరుగుతున్నాయని వేగం కన్నా ప్రాణం మిన్న అన్న సంగతిని వాహనదారులు తెలుసుకోవాలని, రోడ్డు భద్రతా నిబంధనలు పాటించాలని సూచించారు. ద్విచక్ర వాహనదారులు వాహనాలతో రొడ్డెక్కేటప్పుడు తమపై ఆధారపడి కుటుంబాలు జీవిస్తున్నాయనే విషయాన్ని ప్రతిఒక్కరూ గుర్తించాలని తెలిపారు. ద్విచక్ర వాహన చోదకులు విధిగా హెల్మెట్‌లు ధరించాలన్నారు. ప్రతి ఒక్కరూ డ్రైవింగ్ లైసెన్సులు తీసుకోవాలన్నారు. దీనిపై విస్తృతంగా అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామన్నారు.

ప్రజలంతా అప్రమత్తంగా ఉండండి

విశాలాంధ్ర - జియ్యమ్మవలస : మండలంలో ఏనుగుల సంచారం ప్రస్తుతం ప్రజలను భయాందోళనలకు గురి చేస్తున్నాయి. ఐదు రోజుల క్రితం ఒక మగ ఏనుగు పిల్ల జన్మించింది. ఆ ఏనుగు పిల్లను ఇప్పటికే అటవీశాఖ అధికారులు పిల్లకు హరి అని నామకరణం చేశారు కూడా. కాగా ఏనుగుల గుంపు ఆ పిల్ల హరిని జాగ్రత్తగా తమతో పాటే తిప్పుతున్నాయి. ఎవరైనా చూడటానికి వెళితే చాలా ప్రమాదమని ఎవరు కూడా వాటి దగ్గరకు వెళ్ళొద్దని ఆ పిల్ల ఏనుగుని పట్టుకోవడానికి వచ్చే ఉంటారని దాడి చేసే ప్రమాదం ఉందని అటవీశాఖ అధికారులు ప్రజలకు విజ్ఞప్తి చేస్తున్నారు.

ప్రస్తుతం ఏనుగుల గుంపు మండలంలో కన్నపుదొర వలస పంచాయితీ పరిధిలో ఉన్నాయని అటవీశాఖ అధికారులు తెలుపుతున్నారు. ఇంతవరకు ఏడు ఏనుగులు ఉండేవని ఈ పిల్ల ఏనుగు జన్మించడంతో ఎనిమిది అయ్యాయని అటవీ శాఖ అధికారులు చెబుతున్నారు. గత కొద్ది నెలలుగా కనిపించకుండా పోయిన మదగజం హరి ఒరిస్సాకు వెళ్లిపోయిందని చెబుతున్నారు. మరి ఈ పిల్ల హరి జన్మ వృత్తాంతం తెలుసుకొని పెద్ద హరి మరలా రావచ్చేమోనని పలువురు అభిప్రాయపడుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

విశాలాంధ్ర - వీరఘట్టం: మండలం తూడి గ్రామ జంక్షన్ వద్ద ఆదివారం రాత్రి ద్విచక్ర వాహనం ఆర్టిసి బస్సు ఢీకొన సందర్భంలో పాలకొండ మండలం పొట్లి గ్రామానికి చెందిన మీసాల తిరుపతి రావు (38) మృతి చెందినట్లు ఎస్సై జీ కళాధర్ సోమవారం తెలిపారు. వీరఘట్టం నుండి స్వగ్రామానికి వెళుతుండగా ఈ ప్రమాదం సంభవించింది. ప్రమాదం జరిగిన. వెంటనే. గాయపడిన 108 సహాయంతో పాలకొండ తరలించారు. అక్కడినుండి మెరుగైన వైద్యం కోసం శ్రీకాకుళం ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు. మృతుని భార్య సరస్వతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతునికి భార్యతో పాటు ఇద్దరు పిల్లలు ఉన్నారు.

నేడు మంత్రి గుమ్మిడి సంధ్యారాణి పర్యటన

విశాలాంధ్ర - మక్కువ: మన్యం జిల్లా మక్కువ మండలంలో దుర్గేరు గ్రామం నుండి మెండంగి గ్రామం వరకు కోటి 20 లక్షల రూపాయలతో నిర్మించిన బిటి రోడ్డు పనులను రాష్ట్ర గిరిజన శాఖ మంత్రి వర్యులు నేడు ప్రారంభించనున్నారని మండల టిడిపి పార్టీ అధ్యక్షులు గుల్ల వేణుగోపాలనాయుడు తెలిపారు. ఈ కార్యక్రమం అనంతరం సంబర పోలమాంబ అమ్మవారి ఆలయంలో 10వ మంగళవారం సందర్భంగా చండీ హెూమం నిర్వహించబడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తారన్నారు. అనంతరం భారీ అన్నసమారాధన జరుగుతుందన్నారు.

నీటి తొట్టెల నిర్మాణాలు ప్రారంభించాలి

విశాలాంధ్ర - పార్వతీపురం: జిల్లాల్లో పశువుల నీటి తొట్టెల నిర్మాణాలు మంగళవారం ప్రారంభించాలని జిల్లా కలెక్టర్ ఎ. శ్యామ్ ప్రసాద్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ మేరకు సోమవారం సంబంధిత అధికారులతో టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశు సంవర్ధక శాఖ ప్రతిపాదనల మేరకు జిల్లాలో 411 పశువుల తొట్టెలు మంజూరు చేయడం జరిగిందన్నారు. పంచాయతీ రాజ్ సంచాలకులు తక్షణం నిర్మాణాలు చేపట్టాలని ఆదేశించారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులను భాగస్వామ్యం చేయాలని ఆయన ఆదేశించారు. పశు తాగు నీటి తొట్టెలు వేసవి దృష్ట్యా చాలా అవసరమని ఆయన చెప్పారు. పశువులకు తాగు నీరు అందుటకు ఏర్పాటు చేస్తున్న తొట్టెలు నిర్మాణంలో నాణ్యతలో రాజీ పడరాదని ఆయన స్పష్టం చేశారు.

తాగు నీటి సమస్యలపై తక్షణం స్పందించాలి :

మండలాల్లో తాగు నీటి సమస్యలపై వస్తున్న అంశాలు పట్ల తక్షణం స్పందించాలని జిల్లా కలెక్టర్ మండల పరిషత్ అభివృద్ధి అధికారులను ఆదేశించారు. ఎక్కడ తాగు నీటి ఎద్దడి తలెత్తరాదని ఆయన పేర్కొన్నారు. ఇప్పటికే ఎండల తీవ్రత ఎక్కువగా ఉందని వచ్చే మూడు నెలల పాటు అత్యంత అప్రమత్తంగా ఉండాలని ఆయన స్పష్టం చేశారు. మండలాల్లో తాగు నీటి సంబంధిత ఫిర్యాదులకు ప్రత్యేక సెల్ నిర్వహించి ఫిర్యాదులు ఫోన్ ద్వారా గాని, స్వయంగా గాని స్వీకరించి 24 గంటల్లో పరిష్కరించాలని ఆయన ఆదేశించారు. ఇందుకు ప్రత్యేక రిజిస్టర్ నిర్వహించాలని ఆయన అన్నారు. ఈ టెలి కాన్ఫరెన్స్ లో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

విశాలాంధ్ర - మక్కువ: మన్యం జిల్లా మక్కువ మండలంలో మంగళవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని కావున ప్రజలు సహకరించాలని ఏపీ ఈ పి డి సి ఏ ఎల్ ఈ ఈ గోపాలరావు నాయుడు తెలిపారు. మంగళవారం 33/11 ఎస్ ఎస్ మావుడి పరిధిలోగల 11 కెవి చింతలవలస ఫీడర్ పైన ఆర్డీఎస్ఎఫ్. 24 గంటలు పనులు నిమిత్తం ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 4:00 వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేయబడుతుందన్నారు.

అభివృద్ధిని పక్కన పెట్టి క్యాంపు రాజకీయాలా...?

విశాలాంధ్ర - పార్వతీపురం టౌన్: పట్టణ అభివృద్ధిని పక్కన పెట్టిన పుర పురపాలనను గాలికి వదిలేసారని భారత జాతీయ కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ ఓబీసీ జిల్లా చైర్మన్ వంగల దాలి నాయుడు, నియోజకవర్గ చైర్మన్ సిరిసుపల్లి సాయి శ్రీనివాస్, జిల్లా నాయకులు కోలా కిరణ్, మండల అధ్యక్షులు తీళ్ళ గౌరీ శంకరరావు తదితరులు పార్వతీపురం మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్‌లోకి అడుగు పెట్టేందుకే అసహ్యం వేస్తోందన్నారు. అపారిశుధ్యంతో దుర్గంధంతో అపరిశుభ్రంగా ఉందన్నారు. భవనంపై పెచ్చులు ఊడి ఎప్పుడు కూలుతుందో అన్న భయం గొలుపుతోందన్నారు. అప్పటి మంత్రి కాంగ్రెస్ పార్టీ నాయకులు శత్రుచర్ల విజయరామరాజు సహాయ సహకారాలతో అప్పటి మున్సిపల్ చైర్ పర్సన్ స్వర్గీయ నరసింహ ప్రియా థాట్రాజ్ పాలనలో రూ.76.51 లక్షల ఐడిఎస్ఎంటి నిధులతో 2008లో షాపింగ్ కాంప్లెక్స్ ప్రారంభించారన్నారు. ప్రస్తుతం ఆ షాపింగ్ కాంప్లెక్స్ నిరాధారణకు గురైందన్నారు. బినామీ వ్యక్తుల చేతుల్లోకి షాపులు వెళ్లాయని ఆరోపించారు.పార్వతీపురం మున్సిపాలిటీకి తాగునీరు, మున్సిపల్ కార్యాలయ నిర్మాణం, మార్కెట్ల నిర్మాణం, షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం ఇలా అనేక అభివృద్ధి పనులు కాంగ్రెస్ పాలనలోనే జరిగాయన్నారు. ఏదైనా పార్వతీపురానికి మంచి జరిగిందంటే అది కాంగ్రెస్ పాలనలోనే అని అన్నారు. ప్రస్తుతం పౌరపాలన గాలికి వదిలేసి వైసిపి, కూటమి పార్టీలు చైర్ పర్సన్, వైస్ చైర్మన్ ల పదవుల కోసం క్యాంపు రాజకీయాలు చేస్తున్నాయని ఆరోపించారు. ఉన్న అతి కొద్ది కాలానికి పదవుల పందేరం ఆడుతున్నారన్నారు. తమ వార్డులకు మంచి చేస్తారని ఓట్లు వేసి గెలిపించిన ప్రజల నమ్మకాలను వమ్ము చేస్తూ అభివృద్ధి మంత్రంతో ఇదే అదునుగా కౌన్సిలర్లు జంపింగ్ జిలాని ఆటలు ఆడుతున్నారని ఆరోపించారు. జరుగుతున్న తతంగమంతా ప్రజలు చూస్తున్నారని, రానున్న ఎన్నికల్లో తగిన బుద్ధి చెబుతారన్నారు. పదవుల పందేరం పై పెట్టే దృష్టి, కనబరిచే ఆసక్తి మున్సిపాలిటీ బాగు కోసం చేయాలని హితవు పలికారు.కుళాయిల్లో రోజు తాగునీరు ఇవ్వలేని దుస్థితి బాధాకరమన్నారు. కాంగ్రెస్ పాలనలో ప్రతిరోజు మున్సిపల్ కులాల్లో తాగునీరు ఇచ్చేవారన్నారు. టిడిపి, వైసిపి, కూటమి పాలనలో పార్వతీపురం ప్రజలకు తాగునీటి ఇక్కట్లు తప్పడం లేదన్నారు.జిల్లా కలెక్టర్ పురపాలనపై దృష్టి సారించి, గాడి తప్పిన పాలనను గాడిలో పెట్టాలని కోరారు.

అడిగిన సమాచారం ఇవ్వండి...

లేకుంటే సమాచార హక్కు చట్టాన్ని రద్దుచేయండి

మాజీ ఉపముఖ్యమంత్రి రాజన్నదొర

విశాలాంధ్ర - సాలూరు: సాలూరు నియోజకవర్గంలోని ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఎన్ని వినతలు వచ్చాయి అందులో ఎన్ని సమస్యలకు పరిష్కారం చూపబడ్డాయని సమాచార హక్కు చట్టం ద్వారా రెండు నెలల క్రితం కోరగా నేటికి సమాచారం లభించలేదని మాజీ ఉపముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర అన్నారు.నియోజకవర్గం లో మెంటాడ మండలం విజయనగరం జిల్లాలో ఉన్నందున విజయనగరం జిల్లా అధికారులు అడిగిన సమాచారం పూర్తిస్థాయిలో అందించారన్నారు.పార్వతీపురం మన్యం జిల్లా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు.కూటమి ప్రభుత్వం ఏర్పాటు అయిన తరువాత ఎంతమంది ఫీల్డ్ అసిస్టెంట్‌లను సస్పెండ్ చేశారని లాయర్ రేగుమహేష్ కోరగా నేటికీ జవాబు రాలేదన్నారు. మన్యం జిల్లాలో అధికారుల పనితీరు అధ్వాన్నంగా ఉందన్నారు. చివరకి న్యాయస్థానం ఇచ్చిన డైరెక్షన్ కూడా పాటించడం లేదన్నారు.కోర్టు ధిక్కారణ కేసు ద్వారానే న్యాయం లభిస్తుందన్నారు.తామే చట్టం అన్నట్లు అధికారులు ప్రవర్తిస్తున్నారన్నారు. మేథావుల సమస్యలే పరిష్కారం కావడం లేదన్నారు. ప్రభుత్వ కార్యాలయాలలో ప్రజాసమస్యల పరిష్కార వేదిక,ప్రజాప్రతినిధుల వద్ద ప్రజాదర్బార్‌లు మొక్కుబడిగా నిర్వహిస్తున్నారన్నారు. అడిగిన సమాచారం ఇవ్వని అధికారులని శిక్షించండి లేదా చట్టాన్ని రద్దు చేయాలని న్యాయపోరాటం చేస్తానన్నారు.

ఉగాదికి ఉచిత బస్సు తుస్సేనా

ఉగాది నుండి రాష్ట్రంలో మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పిస్తామని కూటమి ప్రభుత్వం హామీ తుస్సు మన్నాదని రాజన్నదొర ఎద్దేవా చేశారు.స్థానిక ఎమ్మెల్యే,మంత్రి అయిన గుమ్మిడి సంధ్యారాణి కర్ణాటక వెళ్లి ఉచితబస్సు పథక పనితీరుని అధ్యయనం చేశారని అనంతరం ఉగాది నుండి ఉచిత బస్సు సౌకర్యం కల్పిస్తున్నామని ప్రకటించారన్నారు. ఆ హామీ ఏమయిందని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపి రెడ్డి సురేష్, సీనియర్ నాయకులు దండి శ్రీనివాసరావు, కౌన్సిలర్ గిరిరఘు, శివరాంపురం సర్పంచ్ జరజాపు మోహన్ తదితరులు పాల్గొన్నారు.

చెన్నకేశవ స్వామి సంబరాలు

విశాలాంధ్ర - వి.ఆర్.పురం: అల్లూరి సీతారామరాజు జిల్లా మండల కేంద్రంలో రేఖపల్లిలో ఉగాది పండుగ పర్వదినాన్ని పురస్కరించుకొని మామిడి రాజు దంపతుల ఆధ్వర్యంలో చెన్నకేశవ స్వామి వారి సంబరాలను ఘనంగా నిర్వహించారు. ములకలపల్లి మండలం జగన్నాథపురం నుండి తోడ్కొని వచ్చిన చెన్న కేశ్వరస్వామి భారీ ఊరేగింపు మండల కేంద్రంలోని రేఖపల్లి గ్రామం పురవీధుల్లోని మామిడి రాజు స్వగృహంకు చేరింది. ముందుగా కూనవరంలో శబరి గోదావరి నదులలో చెన్నకేశవ స్వామి వారి ప్రతిరూపాలను స్నానం ఆచరింప చేసి ఊరేగింపుగా తీసుకొని రాగా భక్తులు స్వామి ప్రతిరూపాలకు స్వామివారికి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం మామిడి రాజు ఇంటి వద్ద నుండి ఊరేగింపు ప్రారంభమైంది. ఈ కార్యక్రమంలో జగన్నాద పురం వాస్తవ్యులు దైవ జనులు గూడూరు అప్పారావు, కాటారపు అప్పారావు, కాటారపు వెంకట్రావు, కొనకాల సాయిబాబు, పామర్థి శ్యామ్, తలగాని నాగరాజు, వేముల పల్లి రామారావు, తలగాని సత్తిబాబు, తలగానిమణి, జుత్తిక సూర్యచంద్రరావు, మామిడి వెంకటేశ్వరరావు, మామిడి పుణ్ణేశ్వరరావు, మామిడి బాలజీ, మామిడి గంగాధర్, మామిడి చంద్ర శేఖర్, మామిడి వంశి గౌడ్, మామిడి చైతన్య కుమార్, గుండు నరసింహారావు, మామిడి సత్యనారాయణ, తలగాని రామచంద్రం, తలగాని వెంకటేశ్వర్లు, మాజీ జడ్పీటిసి ముత్యాల రామారావు, ముళ్ళపూడి రాంబాబు, గెద్దం లక్ష్మణరావు పాల్గొన్నారు.

యువతిని హత్య చేసి ఆత్మహత్యగా చిత్రీకరించిన నిందితుడు

అనుమానాస్పద మృతి కేసును 48 గంటల్లో చేధించిన పోలీసులు

విశాలాంధ్ర - సాలూరు: మండలంలో చీపురువలస సమీపంలోని జీడితోటలో మార్చి 28 వ తేదీన అనుమానాస్పద స్థితిలో మృతిచెందిన వాటిక ఐశ్వర్య (21) మృతి కేసు మిస్టరీని సాలూరు పోలీసులు 48 గంటల్లో చేధించి నిందితులను గుర్తించారు. అందులో ప్రధాన నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. కేసుకు సంభంధించిన వివరాలను సోమవారం మధ్యాహ్నం పార్వతీపురం మన్యం జిల్లా ఏఎస్పీ అంకితా సురానా సాలూరు రూరల్ పోలీసు స్టేషన్‌లో విలేకరుల సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించారు. ఆమె తెలిపిన వివరాల ప్రకారం సాలూరు మండలం దత్తివలస గ్రామానికి చెందిన పెరుమాళ్ళ రాంబాబు అలియాస్ శ్రీరామ్ అనే వ్యక్తి హత్యచేసి ఆత్మహత్య గా చిత్రీకరించాడు. రాంబాబు, ఐశ్వర్యలకు ఆర్నెల్ల క్రితం పసుపువానివలస గ్రామంలో ఒక వివాహ శుభకార్యంలో పరిచయం ఏర్పడింది. అప్పటి నుండి వీరిద్దరూ తరుచూ ఫోన్ కాల్‌లో మాట్లాడుకోవడం జరుగుతుంది. 2025వ సంవత్సరం జనవరి నెల నుండి విశాఖపట్నం లోని ఆరిలోవ ప్రాంతంలో పైనాపిల్ కాలనీలో భార్యాభర్తలమని ఇరుగు పొరుగు వారిని నమ్మించి ఒక ఇంటిలో నివాసం ఉంటున్నారు. ఇటీవల మార్చి 26వ తేదీన శంబర డ్యాం సమీపంలో వీరివురూ కలిసి మాట్లాడుకున్నారు. ఈ సందర్భంలో పెళ్లి చేసుకోవాలని ఐశ్వర్య రాంబాబును కోరింది. అప్పటికే తనకు పెళ్లి అయిందన్న విషయాన్ని దాచిపెట్టి రాంబాబు ఐశ్వర్యతో సంబంధాన్ని కొనసాగించాడు. ఈ విషయంపై వీరిమధ్య తరుచూ గొడవ జరుగుతూనే ఉంది. ఇదిలా ఉండగా మరుసటి రోజు అనగా మార్చి 27వ తేదీన తమ ఇళ్ల నుండి ఐశ్వర్య, రాంబాబులు విశాఖపట్నం వెళ్లి పెళ్లి చేసుకుందా మనుకున్నారు. వీరివురూ ఆరిలోవలో ఉన్నప్పుడు ఇద్దరి మధ్య వివాహ ప్రస్తావన వచ్చి తగాదా జరిగింది. అలాగే ఐశ్వర్య తన బావతో తరుచూ ఫోన్ మాట్లాడుతుందని రాంబాబు అనుమానించాడు. ఈ విషయంపై తీవ్రస్థాయిలో

వాగ్వాదం జరగడంతో సహనం కోల్పోయిన రాంబాబు రూంలో లభించిన నైలాన్ తాడుతో ఉరివేసి చంపేశాడు. అనంతరం ఆరిలోవలో ఉన్న లైఫ్‌కేర్ ఆసుపత్రికి తీసుకువెళ్లగా అప్పటికే మరణించినట్లు వైద్యులు తెలిపారు. దీనితో ఏ2గా ఉన్న తన స్నేహితుడిని పిలిచి మృతదేహం సాలూరు తీసుకురావడానికి పక్కా ప్రణాళిక రచించారు. ఏ2 సహాయంతో రాంబాబు విశాఖపట్నం నుండి సాలూరు మండలం చీపురువలసకు ద్విచక్రవాహనంపై ఐశ్వర్య మృతదేహాన్ని తీసుకువచ్చి చీపురువలస సమీపంలోని జీడితోటలో ఉరివేసుకున్నట్లు

చిత్రీకరించాడు. తన స్నేహితుడు ఐశ్వర్య మృతదేహాన్ని పట్టుకొని కూర్చోగా రాంబాబు వాహనం నడుపుతూ తీసుకువచ్చిన సిసి టీవి దృశ్యాలను పోలీసులు విలేకరులకు చూపించారు. నిందితులు జాతీయ రహదారిపై కాకుండా వివిధ ప్రత్యామ్నాయ మార్గాలను అనుసరించి సాలూరు చేరుకున్నారని ఏఎస్పీ అంకితా సురానా వివరించారు. రామభద్రపురం దగ్గరలో మరొక స్నేహితుడు (ఎ3) నిందితుడు ప్రయాణిస్తున్న బండిలో నింపేందుకు పెట్రోల్ తీసుకు వచ్చాడు. అంతేకాకుండా చీపురువలస చేరుకున్న వరకు పైలెట్‌గా ఉపయోగపడ్డాడని వివరించారు. 48 గంటల్లోగా సాంకేతిక ఆధారాలతో నిందితుడిని స్థానిక పోలీసులు పట్టుకోవడంతో వారిని ఆమె అభినందించారు. కేసు దర్యాప్తు నిర్వహించి మిగిలిన నిందితులను అదుపులోకి తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో రూరల్, టౌన్ సిఐలు రామకృష్ణ, అప్పలనాయుడు, సాలూరు రూరల్,పాచిపెంట, మక్కువ ఎస్ఐలు పాల్గొన్నారు.

మంచిపల్లి సత్యవతి జాతీయ ఉగాది పురస్కారాలకు

నలుగురు సాహితీవేత్తలు

విశాలాంధ్ర, పార్వతీపురం: పార్వతీపురం మన్యంజిల్లా కేంద్రంలోని సాహితీలహరి, మంచిపల్లి సేవాసంస్థవారు ప్రతీ సంవత్సరంఇచ్చే శ్రీమతి మంచిపల్లి సత్యవతి జాతీయ ఉగాది పురస్కారాలు 2022 నుండి 2025 వరకు గతనాలుగు సంవత్సరాలకు ఉగాది పర్వదిన పురస్కార గ్రహీతలుపేర్లను సాహితీ లహరి వ్యవస్థాపకులు డాక్టర్ మంచిపల్లి శ్రీరాములు మరియు బాలసాహిత్య నిలయం వ్యవస్థాపకులు మంచిపల్లి పార్థసారథిలు ప్రకటించారు. ఇప్పటివరకు గత 14 సంవత్సరాలుగా శ్రీమతి మంచిపల్లి సత్యవతి జాతీయ ఉగాది పురస్కారాలు ఇస్తున్నామని శ్రీరాములు తెలిపారు. ఈ పురస్కారాలను గత నాలుగు సంవత్సరాలుకు (2022 నుండి 2025)గాను వరుసగా బాలసాహిత్యంలో విశేష కృషి చేసినందుకు గాను మరియు బాలసాహిత్యంలో అనేకకథలు, బాల గేయాలు, బాలకవితలువ్రాసి అనేక పుస్తకాలు ప్రచురించి,బాల సాహిత్యానికి ఎనలేని కృషి చేసినందుకు ఈ పురస్కారంలు ప్రకటించామన్నారు. బెహరా ఉమామహేశ్వరరావు (పార్వతీపురం), దార్ల బుజ్జిబాబు(గుంటూరు), అమరావది నీరజా(హైదరాబాద్), ఆకెళ్ళ వెంకటసుబ్బలక్ష్మి(రాజమండ్రి) లను ఎంపిక చేయడం జరిగిందన్నారు. గత నాలుగేళ్లకు ఎంపిక చేసిన నలుగురు సాహితీవేత్తలకు ఏప్రిల్ 13న పార్వతీపురంలో జరిగే సాహిత్యసభలో పురస్కారం అంద చేయబడునని మంచిపల్లి సేవాసంస్థ డైరెక్టర్ మంచిపల్లి పార్థసారథి తెలిపారు. ఈపురస్కారాన్ని గతంలో రెడ్డి రాఘవయ్య, పాయల సత్యనారాయణ ,బెలగాం భీమేశ్వరరావు, స్వరాజ్యం వెంకట రాజ్యలక్ష్మి, వెలగా వెంకటప్పయ్య ,ఆలపాటి వెంకటరావు, ఎన్వివి సత్యనారాయణమూర్తి, గంగిశెట్టి శివకుమార్, నారంశెట్టి ఉమామహేశ్వరరావు, దాసరి వెంకటరమణ, డికే. చదువులబాబు ,ప్రత్తిపాక మోహనరావు, ముంజలూరు కృష్ణకుమారి, ఎంవివి సత్యనారాయణలు తీసుకున్నట్లు తెలిపారు.

నీటి నాణ్యత ప్రమాణాల పరీక్షలను

ఎప్పటికప్పుడు చేపట్టాలి

విశాలాంధ్ర - పార్వతీపురం : జిల్లాలో నీటి నాణ్యత ప్రమాణాల పరీక్షలను ఎప్పటికప్పుడు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఎ. శ్యామ్ ప్రసాద్ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు సోమవారం సంబంధిత అధికారులతో టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఆరోగ్య శాఖ, ఆర్.డబ్ల్యూ.ఎస్ శాఖల పరిధిలో చేపడుతున్న నీటి నాణ్యత పరీక్షలు పక్కాగా ఉండాలని ఆయన స్పష్టం చేశారు. రెండు శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. వేసవి దృష్ట్యా నీటి నాణ్యత ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలన్నారు.

నీటి నాణ్యత ప్రమాణాల పరీక్షలకు సంబంధించి ఆర్డబ్ల్యూఎస్ పరిధిలో 14 రకాల టెస్టులను చేపట్టడం జరుగుతుందని, దీనిని ప్రతీరోజు పర్యవేక్షణ చేయాలని అన్నారు. ఇందుకు సంబంధించిన నివేదికలను సమర్పించాలని ఆదేశించారు. అన్ని రకాల టెస్టులను చేపట్టాలని సూచించారు. ఈ పరీక్షల విషయమై క్షేత్రస్థాయిలో అధికారులు అవగాహన కలిగి ఉండాలని బయోలాజికల్ కంటెంట్, క్లోరిన్ లెవెల్ టెస్ట్ లను ఎలా చేపడుతున్నారని ప్రశ్నించారు. నీటి నాణ్యత పరీక్షలలో ఇప్పటిదాకా పాజిటివ్ నమోదు అంశాలను అడిగి తెలుసుకున్నారు. నీటి నాణ్యత ప్రమాణాలు సరిగా లేకపోతే ఏం చేయాలి అనే దానిపై దృష్టి సారించాలని ఆయన ఆదేశించారు. వేసవిలో కలుషితం అయ్యే అవకాశం ఉంటుందని, ప్రతి నిత్యం అప్రమత్తంగా ఉండాలని స్పష్టం చేశారు.

చలివేంద్రాలు ఏర్పాటు చేయాలి :

వేసవి వేడిమి దృష్ట్యా చలివేంద్రాలు విస్తృతంగా ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్ ఎ. శ్యామ్ ప్రసాద్ చెప్పారు. గ్రామ పంచాయతీ, మండల స్థాయిలో అవసరమగు అన్ని ప్రాంతాల్లో చలివేంద్రాలు ఏర్పాటు చేయాలన్నారు. ఆయా ప్రాంతాల్లో ఉన్న కార్యాలయాలు, సంస్థలు, సంఘాల సహకారం తీసుకోవాలని చెప్పారు. మున్సిపాలిటీలు, గ్రామ పంచాయతీలు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

వేసవి వేడిమి దృష్ట్యా ప్రజలు అప్రమత్తంగా ఉండాలి :

వేసవి వేడిమి పెరిగిందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ సూచించారు. అత్యవసర పనులు ఉంటే బయటకు రావాలని అన్నారు. టోపీ, గొడుగు వంటి వస్తువులు నీడ కోసం వాడాలని అన్నారు. తెల్లని వదులు దుస్తులు వేసుకోవడం మంచిదని చెప్పారు. ఉపాధి హామీ ప్రదేశాల్లో సైతం నీడ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. వేతనదారులకు నీరు అందుబాటులో ఉంచాలని చెప్పారు.

ఎండ ఎక్కువగా ఉన్న సమయంలో ఉపాధి హామీ పనులు చేపట్టకుండా సమయాల్లో మార్పులు చేసుకోవాలని సూచించారు. ప్రతి ఒక్కరూ నీరు ఎక్కువగా తాగాలని, శరీరం డీ హైడ్రేషన్ కాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

వడ దెబ్బ తగలకుండా ప్రతిఒక్కరూ జాగ్రత్త వహించాలని, ఎక్కువ సేపు ఎండలో ఉండి అతి చల్లని పదార్థాలు తీసుకోవడం ఆరోగ్యానికి మంచిది కాదని ఆయన హితవు పలికారు. ఎండలో ఎక్కువ సేపు తిరిగి చల్లని నీటిని తలపై వేసుకోవడం వలన కూడా వడ దెబ్బ తగిలే అవకాశాలు ఉంటాయని అన్నారు. రోజు రోజుకు పెరుగుతున్న వేడిమి దృష్ట్యా ప్రతి ఒక్కరూ అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని, అవసరం మేరకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచుకోవడం, కొబ్బరి బొండాలు పానీయాలు తీసుకుని ఆరోగ్యం కాపాడుకోవాలని కోరారు.

బాలికల మినీ గురుకులంను సందర్శించిన బాలల హక్కుల కమిషన్ చైర్మన్ కేసలి

విశాలాంధ్ర - పాచిపెంట: ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ చైర్మన్ కేసరి అప్పారావు పాచిపెంట లో గల గిరిజన బాలికల మినీ గురుకులం ను ఆదివారం సందర్శించారు. విద్యార్థులకి అందుతున్న సౌకర్యాలు,సేవలు గురించి ఆరా తీసి సంతృప్తి వ్యక్తం చేశారు.వంటకాలను పరిశీలించి రుచి చూసారు. సిబ్బంది బాలల ఆహారం మరియు ఆరోగ్యం విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలనీ నిరంతరం పర్యవేక్షణ చేయాలని సూచించారు. పదవ తరగతి పరీక్షలు కు హాజరవుతున్న విద్యార్థులును ఉద్దేశించి మాట్లాడుతూ ఒక లక్ష్యం ఏర్పరచుకొని వాటిని సాధించే దిశగా అడుగులు వేయాలని, సోషల్ మీడియా కు సెల్ ఫోన్లు కు దూరంగా ఉండాలని,తల్లిదండ్రులు కన్న కలలను నెరవేర్చాలని కోరారు. సి సి కెమెరాలు నిరంతరం పనిచేస్తూ ఉండాలని ,అనధికార వ్యక్తులును అనుమతించరాదని తెలిపారు. ఈ కార్యక్రమంలో గురుకులం హెచ్ఎం సిబ్బంది పాల్గొన్నారు.

వ్యాన్, ద్విచక్ర వాహనం ఢీ: ఒకరికి తీవ్రగాయాలు

విశాలాంధ్ర - జి.మాడుగుల: వ్యాన్, ద్విచక్రవాహనం ఢీకొన్న సంఘటలో ఒకరికీ తీవ్రగాయలైన సంఘన మండలలోని సామవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలపిన వివరాలు మేరకు సోమవారం మధ్యహ్నాం సంతబయలు మలుపు వద్ద ముంచంగిపుట్టు మండలం దౌడుపుట్టు నుంచి ఈ ప్రాంత ఆశ్రమ పాతశాలలకు బొలేరో వాహనంలో కూరగాయాలు తరలిస్తు వస్తుండగా మండలానికి చెందిన గద్దెరాయి గ్రామానికి చెందిన జగ్గందోర హనగోపాల్ ఎదురుగా వస్తున్న వ్యాన్ బలంగా ఢీకొట్టాడంతో అతనికి తీవ్రగాయలైంది. దీంతో స్థానికులు సహయంతో 108 వాహనంతో జి.మాడుగుల పీహెచ్‌సీకి

తరలించి ప్రధమ చికిత్స అనంతరం మెరుగైన వైద్య సేవలు నిమిత్తం పాడేరు జిల్లా ఆసుపత్రికి తరలించారు. ఈ సంఘనపై పోలీసులు నమోదు చేయాల్సి ఉంది.

ఉత్తమ సేవలే గుర్తింపునిస్తాయి

జిల్లా విద్యాశాఖ అధికారి డాక్టర్ తిరుపతి నాయుడు

విశాలాంధ్ర - పార్వతీ పురం/కురుపాం: ప్రతీఒక్క ఉద్యోగి తన భాధ్యతతో ఆయా రంగంలో అందించిన సేవలే ప్రత్యేక గుర్తింపు ఇస్తాయని పదవీవిరమణ సందర్భంగా మన్యం జిల్లా విద్యాశాఖ అధికారి డాక్టర్ నల్ల తిరుపతి నాయుడు

అన్నారు. సోమవారం సాయంత్రం లయన్స్ కళ్యాణ మండపంలో సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ అతితక్కువ కాలంలో మన్యం జిల్లా విద్యాశాఖ కు అందించిన సేవలు కొనియాడారు. ఉద్యోగ భాధ్యతను నిర్వహించిన సమయంలో సహాయ సహకారాలు అందించిన అన్ని వర్గాలకు ఈసందర్భంగా ధన్యవాదాలు తెలిపారు. అలాగే పాలవలస ఎడి దామోదర్‌ను జిల్లా విద్యాశాఖ అధికారి ఘనంగా సన్మానించారు.

డోలిమోతలు లేని రహదారులు కావాలన్నదే కూటమి ధ్యేయం

విశాలాంధ్ర - కొయ్యూరు: డోలుమెతలు లేని మన్యం రహదారులు కావాలన్నదే కూటమి ప్రభుత్వం ధ్యేయమని తెలుగుదేశం పార్టీ మండల ప్రధాన కార్యదర్శి తోటా దొరబాబు మండల మహిళా అధ్యక్షురాలు బోనంగి సత్యవతి అన్నారు. ఆదివారం తెలుగువారి నూతన సంవత్సరం రోజు అయిన ఉగాదినాడు మండలంలో చిట్టెంపాడు పంచాయతీ లింగాపురం గ్రామానికి, అదే పంచాయతీలో గోపవరం నుండి లింగాపురానికి రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా తోట దొరబాబు సత్యవతి మాట్లాడుతూ పాడేరు నియోజకవర్గం ఇన్చార్జి మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి ఆదేశాల మేరకు ఈ రోడ్డు పనులు కు శంకుస్థాపన చేయడం జరిగింది అన్నారు అలాగే ఎన్డీఏ కూటమి ప్రభుత్వం మారుమూల ప్రాంతాలకు సైతం డోలుమోతలు ఉండకూడదనే ఉత్యాసంతోనే రహదారులు వేయాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. రానున్న కాలంలో మండలంలో మారుమూల గ్రామాల అన్నింటికీ రహదారులు నిర్మించడం జరుగుతుందని వారు ఈసందర్భంగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు ఆయా గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు

ఘనంగా మోదకొండమ్మ ప్రాంగణంలో ఉగాది వేడుకలు

విశాలాంధ్ర పాడేరు: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నారా చంద్రబాబునాయుడు ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ఉగాది పండుగను తెలుగువారి పండగా ఉగాది పర్వదిన నాడు శ్రీ విశ్వ సపు నామ సంవత్సర ఉగాది వేడుకలను ఘనంగా నిర్వహించాలని అదే సాల మేరకు అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో ఉత్తరాంధ్ర ఆరాధ దైవం పాడేరులో వెలిసిన శ్రీశ్రీశ్రీ మోదకొండమ్మ అమ్మవారి ఆలయ ప్రాంగణంలో ఎంతో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాడేరు నియోజకవర్గం టిడిపి ఇంచార్జి గిడ్డి ఈశ్వరి హాజరై మాట్లాడుతూ తీపి చేదు కలిసిందే జీవితమని, కష్టం సుఖం తెలిసిందే జీవితం అన్నారు. ఆ జీవితంలో ఆనందోత్సవాలని ఊహించేందుకు వచ్చిందే ఉగాది పర్వదినం అని ఆమె అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ఉగాది పర్వదినాన్న ఎంతో ప్రతిష్టాత్మకంగా తెలుగోళ్ళందరూ జరుపుకోవాలని అనడం చాలా ఆనందకరంగా ఉందన్నారు. ప్రజల పక్షాన నిలబడి ప్రజల కష్టాలు తీర్చేదే తెలుగుదేశం పార్టీ అని అన్నారు.రాష్ట్ర అభివృద్ధి తెలుగుదేశం ప్రభుత్వంతోనే సాధ్యమన్నారు. ఈ కార్యక్రమంలో సబ్ కలెక్టర్, డి ఆర్ ఓ, రెవెన్యూ అధికారులు,

ఉపాధ్యాయ బృందం. అధికారులు, అనధికారులు, ఉద్యోగ ప్రముఖులు, మహిళా సోదరీమణులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన

విశాలాంధ్ర రాజవొమ్మంగి: నియోజకవర్గ ఎమ్మెల్యే మిరియాల శిరీష ఆదివారం రాజవొమ్మంగి మండలంలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు,వట్టిగెడ్డ రిజర్వాయర్ పంట కాలవ పూడికతీత పనులకు శంకు స్థాపన చేశారు,పది లక్షల వ్యయంతో ఈ పనులు చేపడుతున్నట్లు ఆమె తెలిపారు,అనంతరం దూసరిపాము ఎంపీయూపీ స్కూల్ లో 5లక్షల రూపాయలతో ఆట స్థలం అభివృద్ధికి శంకుస్థాపన చేశారు,ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్యం ఎన్ని కష్టాలలో ఉన్న నియోజవర్గ అభివృద్ధికి ఎంతో కృషి చెందుతోందని తెలిపారు, ఈ కార్యక్రమంలో తెలుగు యువత అధ్యక్షుడు మతం భాస్కర్,,మండల తెలుగుదేశం అధ్యక్షుడు గొల్లపూడి పెద్దిరాజు,మార్కెట్ చైర్మన్ లోతా లక్ష్మణరావు,ముప్పన కేశవ్,పార్టీ కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.